క్లుప్తంగా

బడ్జెట్‌లో 20శాతం విద్యకు కేటాయించాలి



మాట్లాడుతున్న ఫరాజ్ అహ్మద్

నిజామాబాద్‌నాగారం: 2025–26 ఆర్థిక సంవత్సరానికి విద్యారంగానికి కనీసం 20శాతం బడ్జెట్ కేటాయించాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐవో) రాష్ట్ర అధ్యక్షుడు ఫరాజ్ అహ్మద్ అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఎస్ఐవో ఆధ్వర్యంలో తెలంగాణ ప్రత్యేక పుస్తకాన్ని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగానికి తగినంత నిధులు కేటాయించకపోవడం వల్ల చదువు మానేసే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు. రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అహ్మదుద్దీన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభం



చిన్నారికి మందులు అందజేస్తున్న సిబ్బంది

నిజామాబాద్‌నాగారం: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజామాబాద్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభమైనట్లు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రక్త మార్పిడి అలాగే ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈమేరకు రెడ్‌క్రాస్ ఆస్పత్రిలో సోమవారం సేవలను ప్రారంభించారు. మరిన్ని వివరాలకు 08462-222002ను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి టీజేఎస్ మద్దతు

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థికి తెలంగాణ జన సమితి (టీజేఎస్) సోమవారం మద్దతు ప్రకటించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆదేశాల మేరకు నగరంలో సమితి సభ్యులు సోమవారం అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా నాయకులు దువ్వా వెంకట్, కిరణ్ మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వై అశోక్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. వారి గెలుపు కోసం పార్టీ నాయకత్వం సూచనల మేరకు నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని వారు తెలిపారు.

మంచిప్పలో 'సొసైటీ'ని ఏర్పాటు చేయాలి



మంచిప్ప గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

మోపాల్: మండలంలోని బాడ్సి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని విభజించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిసిందని, ఈనేపథ్యంలో మంచిప్పలో సొసైటీని ఏర్పాటుచేయాలని గ్రామసభ తీర్మానం చేసింది. మండలంలోని మంచిప్పలో సోమవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బాడ్సి సొసైటీకి మంచిప్ప నుంచి ఎవరికీ చైర్మన్ అయ్యే అవకాశం 30 ఏళ్లుగా రాలేదని, మంచిప్పలోనే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తీర్మానించారు. అలాగే పలు సమస్యలపై చర్చించారు. ప్రత్యేకాధికారి శ్రీనివాస్, కార్యదర్శి శ్యామ్, వీడీసీ అధ్యక్షుడు వెంకట్రామ్, యూత్ అధ్యక్షుడు సాయిరాం, వీడీసీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

బోధన్‌రూరల్: వినియోగదారులకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యమని ట్రాన్స్‌కో డీఈ ఎండీ ముక్తార్ అన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా సమ్మర్ యాక్షన్‌లో భాగంగా సోమవారం పట్టణ పరిధిలో మూడు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా లైన్‌లకు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా ఎండీ ముక్తార్ మాట్లాడుతూ వేసవిలో లో వోల్టేజీ సమస్య తలెత్తకుండా నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ లైన్ అనుసంధానం చేస్తున్నామన్నారు. వినియోగదారులు విద్యుత్‌ను అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలకు గురవడంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు వస్తున్నాయన్నారు. రైతులు తమ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లపై నిఘా ఉంచాలని ఆయన సూచించారు. ఏడీఈ నగేష్ కుమార్, ఏఈ కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

రాత్రివేళ రక్షణ ఏదీ?

- రూరల్ మండలంలో వెలుగుచూస్తున్న దారిదోపిడీ ఘటనలు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఇటీవల తాళ్లకొత్తపేట శివారులో దారిదోపిడీ జరిగిన ప్రదేశం

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలోని తాళ్ల కొత్తపేట్ గ్రామ శివారును రాత్రివేళ వాహనదారులు దాటాలంటే జంకుతున్నారు. ఇటీవల వెలుగుచూసిన దారిదోపిడీల ఘటనల నేపథ్యంలో అసలు రాత్రిపూట అటువైపు వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. అయినా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

వర్ని, ఎడపల్లి, ఇతర గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి మండలంలోని కొత్తపేట్ గ్రామ శివారు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన జితేష్ ఇటీవల జిల్లాకేంద్రానికి రాగా, అర్ధరాత్రి తన స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. రూరల్ మండలంలోని కొత్తపేట్ శివారులో అతడిని స్థానిక రైస్‌మిల్‌లో పనిచేసే ముగ్గురు హమాలీలు తీవ్రంగా గాయపరచి అతని వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోను, సోనీ కెమెరాను దొంగిలించారు. అదేరోజు చింతకుంటకు చెందిన రాజేశ్వర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిపై హమాలీలు దారిదోపిడీకి యత్నించగా వారు తప్పించుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ విచారణ చేపట్టి 24గంటల్లోనే నిందితులను పట్టుకున్నారు. ప్రజలు మాత్రం ఇలాంటి ఘటనలు జరిగాక చర్యలు చేపట్టే కంటే, ముందే నివారణ చర్యలు చేపట్టాలని, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని కోరుతున్నారు. అంతే కాకుండా చీకటి ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేసి, గ్రామ అభివృద్ధి కమిటీ తరపున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి



నేను జిల్లా కేంద్రంలో ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాను. నిత్యం జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామానికి వెళ్లాలంటే రాత్రి 11 గంటలు దాటుతుంది. ఈక్రమంలో ఇటీవల వెలుగు చూస్తున్న దారిదోపిడీ ఘటనలతో భయంగా ఉంది. వెంటనే పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి. సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి.

–ఎడ్ల రాజశేఖర్ రెడ్డి, చింతకుంట గ్రామం

రక్షణ కల్పించాలి



అధికారులు అప్రమత్తంగా ఉండి రాత్రివేళ ప్రయాణికులకు రక్షణ కల్పించాలి. తాళ్ల కొత్తపేట్ గ్రామ శివారులో ఇటీవల దారిదోపిడీ దొంగలు వెంబడిస్తే నా చేతికి తీవ్ర గాయం అయింది. ఈ ఘటనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రజల రక్షణకు తగిన చర్యలు చేపట్టాలి.

–ముదాసీర్, చింతకుంట గ్రామం

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించండి



సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తున్న మాలమహానాడు జిల్లా నాయకులు

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిజామాబాద్ జిల్లా మాలమహానాడు నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం వారు జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ ఉప వర్గీకరణ జస్టిస్ షమీమ్ అక్తర్ సమర్పించిన నివేదిక తప్పుల తడకగా ఉందన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2014 జనాభా లెక్కల ఆధారంగా వర్గీకరణ చేయాలన్నారు. మాలలకు 6శాతం ఇవ్వాలని విన్నవించారు. జిల్లా చైర్మన్ ఆనంపల్లి ఎల్లయ్య, కన్వీనర్ అలుక కిషన్, కో–చైర్మన్లు ఎడ్ల నాగరాజు, చొక్కం దేవిదాస్, నాంది వినయ్‌కుమార్, సక్కి ఉదయ్‌కుమార్, పల్లె స్వామి దాస్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన పుట్ట శివాలయం



కలిగోట్ గ్రామంలోని పుట్ట శివాలయం



ఆలయంలో కొలువైన శివపార్వతులు



ఆలయ పరిసరాల్లో ఉన్న పుట్ట

జక్రాన్‌పల్లి(నిజామాబాద్ రూరల్): మండలంలోని కలిగోట్ గ్రామంలోగల పుట్ట శివాలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ప్రతి శివరాత్రి రోజున సుమారు 20 వేల మంది భక్తులు ఈ ఆలయానికి తరలివస్తుంటారు. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. శివాలయం ప్రకృతి రమణీయతకు అద్దం పట్టేలా పచ్చని చెట్లతో విస్తరించి ఉంది. అలాగే పెద్ద వాగు ఒడ్డున నిర్మించిన వివిధ ఆలయాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలయంలో ప్రతి సోమవారం విశేష పూజలు నిర్వహిస్తారు. అలాగే భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేస్తారు. అంతేకాక అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతాయి.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. దేవుళ్ల సాక్షిగా చేసిన వాగ్దానాలు గంగలో కలిపారా అని ఎద్దేవా చేశారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం ఆయన నగరంలోని రీజినల్ లైబ్రరీలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వం ఇస్తానన్న 2 లక్షల ఉద్యోగాల్లో నిజామాబాద్ యువతకు ఎన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారో సీఎం సమాధానం చెప్పాలన్నారు. నిరుద్యోగ భృతి, ఎలక్ట్రికల్ స్కూటీలు, ఆడపడుచులకు రూ.2500 ఎంతమందికి అమలు చేశారో చెప్పిన తర్వాతే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల తరఫున మండలిలో ప్రశ్నించే గొంతు వినబడాలంటే బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్యకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు ఆనంద్‌రావు, వినోద్, మాస్టర్ శంకర్, గంగాధర్, మఠం పవన్, ఆనంద్, సాయి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రింటర్స్ డే

సుభాష్‌నగర్: నగరంలోని పూసలగల్లిలో ప్రింటింగ్ ప్రెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రింటర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, కార్మికులు ర్యాలీ చేపట్టారు. అంతకుముందు జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్, గౌరవాధ్యక్షుడు రావుట్ల జనార్దన్ మాట్లాడుతూ.. ముద్రణ యంత్రాన్ని కనిపెట్టిన జాన్ గూటన్ బర్గ్ జయంతి సందర్భంగా ప్రతియేటా ప్రింటర్స్ డేను నిర్వహిస్తామని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి ఎం కిషోర్, కోశాధికారి కృష్ణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నగరంలో జెండా ఎగురవేస్తున్న ప్రింటింగ్‌ప్రెస్ అసోసియేషన్ ప్రతినిధులు

కోట్లున్న నేతలకే పార్టీల ప్రాధాన్యత



ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేల కోట్ల ఆస్తులున్న అగ్రవర్ణాల వారే పోటీ చేస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీ లాంటి పార్టీలు రూ.వేలకోట్లు ఉన్నటువంటి నాయకులకే ప్రాధాన్యత ఇచ్చారని ధర్మసమాజ్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మంద జ్యోతి అన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అణగారిన వర్గాల గొంతుకనై, వారి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తానని అన్నారు.

ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుమన్, ప్రేమ్, జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మహారాజ్, మురళి, ఉమేష్, నిశాంత్, గంగాధర్, మహేష్, కిషన్ అన్నారు.

ఆధ్యాత్మికం

26న లక్ష్మీగణపతి ఆలయంలో రుద్రాభిషేకం

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా సాయంత్రం 5.30 గంటల నుంచి లింగోద్భవకాలం వరకు రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అరుణ్‌కుమార్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వయంగా జలధారా పాత్రలో బిందెడు నీటిని పోసి కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా శివపార్వతుల పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

సిరికొండ: మండలంలోని లొంక రామలింగేశ్వర స్వామి ఉపాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామివారికి మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కేదారీశ్వర ఆశ్రమంలో కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రానికి సమీపంలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా మట్టితో తయారు చేసిన ప్రత్యేక శివలింగానికి మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఆశ్రమ కమిటీ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ సమక్షంలో వేద పండితుల బ్రహ్మణుల బృందంచే లక్షా పదాహారు రుద్రాక్షలతో లింగానికి అర్చన అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

పీడీఎస్‌యూ నాయకుల ముందస్తు అరెస్టు



నిజామాబాద్ రూరల్: జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సోమవారం పీడీఎస్‌యూతోపాటు వివిధ సంఘాల నేతలను రూరల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకుల సమస్యలు పరిష్కరించకుండా, ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఇటువంటి అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. అరెస్టయిన వారిలో నరేందర్, గణేష్, నిఖిల్, కిషన్ తదితరులు ఉన్నారు.

జోరందుకున్న కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం





ఖానాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు.. న్యావనందిలో..

నిజామాబాద్ రూరల్/సిరికొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం జోరందుకుంది.సోమవారం రూరల్ మండలంలోని ఖానాపూర్ ఒకటవ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు కోర్వ గంగాధర్ విస్తృత ప్రచారం సోమవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే సిరికొండ మండలంలోని న్యావనంది గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా మండల కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. నాయకులు కోర్వ రాజేంద్రప్రసాద్, ఐల రాజలింగం, సంతాజి ఉష, చిన్నబ్బు నర్సారెడ్డి, గంగాధర్ తాండ్ర, నరేష్, పెద్దబ్బు సతీష్, ప్రశాంత్, శ్రావణ్, సాయిబాబా, సాయికుమార్, వినోద్, మధు, దేవరాజ్, స్వామిగౌడ్, రిక్క ముత్తెన్న, మామిడికింది నరేందర్, గొల్ల జనార్ధన్ పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,200	వెండి(కిలో)	1,02,000
22 క్యారెట్స్	82,325	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	15	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	25	50
బీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	50	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: జాబిలమ్మ నీకు అంత కోపమా -11.00, 1.40, 7.30; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్-4.30, 10.20
- స్క్రీన్-2: ఛావా(హిందీ)-11.00,1.40,4.40, 7.30, 10.20
- స్క్రీన్-3: తండేల్(తెలుగు)-1.45, 4.40, 7.30; బాపు(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20; బాపు(తెలుగు)-1.25
- స్క్రీన్-2: ఛావా(హిందీ)-10.00, 7.20, 10.40; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.20; జాబిలమ్మ నీకు అంత కోపమా -4.30
- స్క్రీన్-3: జాబిలమ్మ నీకు అంత కోపమా-10.30; ఛావా(హిందీ)-1.20; తండేల్(తెలుగు)-4.40, 10.20; బాపు(తెలుగు)-7.45
- స్క్రీన్ -4: ది డెవిల్స్ చైర్(తెలుగు)-11.30; రామం రాఘవం(తెలుగు)-1.45; ఛావా(హిందీ)-4.20; సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40; జాబిలమ్మ నీకు అంత కోపమా-10.40

లలితామహల్ తండేల్(తెలుగు)

దేవి జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-11.15, 6.15; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-2.15, 9.15

నటరాజ్ ఛావా(హిందీ)

విజయ్ సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

సంక్షిప్తం

బడులకు రక్షణ కల్పించాలి



నిజామాబాద్ రూరల్: సెలవు రోజుల్లో బడులకు రక్షణ కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ సామజిక రచయితల సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌లాల్ కోరారు. నగరంలోని సంఘం కార్యాలయం సోమవారం ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో ప్రభుత్వ బడులకు రక్షణ లేకపోవడంతో విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి బడులకు వాచ్‌మెన్, అటెండర్లను నియమించాలని కోరారు. సంఘ సభ్యులు శేఖర్, రాజ్ పాల్గొన్నారు..

మెజీషియన్ రంగనాథ్‌కు సన్మానం



నిజామాబాద్ రూరల్: మెజీషియన్ పీసీ సర్కార్ జయంతి సందర్భంగా నగరంలోని రామకృష్ణ విద్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో మెజీషియన్ జాదు రంగనాథ్ దంపతులను సన్మానించారు. అనంతరం రంగనాథ్ ప్రదర్శనను తిలకించారు. కవి కాసర్ల నరేష్, చందన్ రావు, ధర్మేంద్ర, చంద్రశేఖర్, సముద్రాల మాధురి, వెనిగళ్ల సురేష్ పాల్గొన్నారు.

రైతాంగ సమస్యల పరిష్కారానికి కృషి



సుభాష్‌నగర్/ఇందల్వాయి: దేశంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ అధ్యక్షుడు కొండెల సాయిరెడ్డి అన్నారు. ఇటీవల ఆయన సంఘ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికవగా జిల్లా, రాష్ట్ర, జోనల్ నాయకులు సోమవారం తన కార్యాలయంలో ఆయనను సన్మానించారు. అంతకుముందు ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద సాయిరెడ్డికి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికి సన్మానించారు. దక్షిణాది నుంచి అధ్యక్షుడిగా ఎన్నికైన తెలంగాణ వ్యక్తి సాయిరెడ్డి అని కొనియాడారు. జోనల్ కార్యదర్శి నారాయణరెడ్డి, నాయకులు సీహెచ్ సూర్యారెడ్డి, కాపు వినయ్‌కుమార్, పాండురంగారావు, దినేష్, శ్రీనివాస్, సాయినాథ్‌రెడ్డి, కుంట మోహన్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేపీ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలకు సహకరించాలి

నిజామాబాద్ రూరల్: ఈనెల 26న బుధవారం నిర్వహించనున్న మహా శివరాత్రి వేడుకలకు జిల్లా ప్రజలు సహకరించాలని నిజామాబాద్ జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ శ్రీరాంరవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా నగరంలోని కంఠేశ్వరాలయంలో భక్తులు రద్దీ ఎక్కువగా ఉండడంతో వారి వాహనాలు పక్కనే ఉన్న పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేయాలని కోరారు. ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేస్తే పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.